

ఉజ్వల భవిష్యత్తుకు 'నవోదయం'
చలకుర్తి జేఎన్‌వీలో 2024–25 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. - 8లో


స్పష్టమైన ప్రకటన చేయాలి
సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని రంగారెడ్డి డిమాండ్ చేశారు. - 10లో


పోలీసు పహారాలో బాల్నేపల్లి
అడవిదేవులపల్లి మండలంగ బాల్నేపల్లిలో మంగళవారం పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. - 10లో

న్యూస్‌రీల్

కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్‌గా చాతరాజు

- అసిస్టెంట్ కమిషనర్‌గా స్వర్ణకుమారి

నల్లగొండ : నల్లగొండ కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్‌గా రాజాకృష్ణ చాతరాజు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న దీపారెడ్డి బదిలీపై వెళ్లగా హైదరాబాద్‌లో పనిచేస్తున్న చాతరాజును నల్లగొండకు బదిలీ చేశారు. అదే విధంగా నల్లగొండలో అసిస్టెంట్ కమిషర్‌గా పనిచేస్తున్న రామలక్ష్మయ్యను బదిలీ చేసి ఆయన స్థానంలో హైదరబాద్ నుంచి పి.స్వర్ణకుమారిని ఇక్కడ నియమించారు.

మద్యం దుకాణాలకు 198 దరఖాస్తులు

నల్లగొండ క్రైం : జిల్లాలోని 155 మద్యం దుకాణాలకు మొత్తంగా 198టెండర్ దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ అధికారి సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 వరకు మద్యం టెండర్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక అభ్యర్థి ఎన్ని దరఖాస్తులైనా వేయవచ్చని టెండర్ డ్రాలో ఎన్ని షాపులు దక్కినా ఇస్తామని తెలిపారు. మంగళవారం ఒక్కరోజే 103 దరఖాస్తులు వచ్చాయయని పేర్కొన్నారు.

మూసీకి తగ్గిన ఇన్‌ఫ్లో .. గేట్లు మూసివేత


వరద నీటితో కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

కేతేపల్లి: ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో 20రోజులుగా తెరిచి ఉంచిన గేట్లను మూసివేశారు. మంగళవారం ఎగువ నుంచి మూసీకి 1,436 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం 643.45 అడుగుల వద్ద ఉంది. మూసీ కుడి, ఎడమ కాలువలకు 568 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.05 టీఎంసీల నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

సరిపడా గోదాములు లేకనే ఇబ్బందులు

- సీఎంఆర్ దిగుమతిలో జాప్యంపై సివిల్ సప్లయీస్ డీఎం


గోదాములను పరిశీలించి మాట్లాడుతున్న సివిల్ సప్లయీస్ డీఎం నాగేశ్వరరావు

మాడుగులపల్లి: మిల్లర్లు సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యం సకాలంలో ఇస్తున్నా సరిపడా గోదాములు లేక దిగుమతిలో జాప్యం జరుగుతోందని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు. మాడ్గులపల్లి మండలంలోని కొత్తగూడెం శివారులో గల ఎఫ్‌సీఐ గోదాములను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కొత్తగూడెం గోదాముల్లో బియ్యం దిగుమతికి సరైన స్థలం లేకపోవడంతో లారీలు రోజుల తరబడి ఉంటున్నాయన్నారు. నిత్యం 120 లారీల బియ్యాన్ని పంపేందుకు మిల్లర్లు సిద్ధంగా ఉన్నా జిల్లాలో సరిపడా గోదాములు అందుబాటులో లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా మరిన్ని గోదాములను ఎఫ్‌సీఐ ఆధీనంలోకి తీసుకుంటే బియ్యం సరఫరా సకాలంలో జరుగుతుందని పేర్కొన్నారు. వానాకాలానికి సంబంధించి 1,03,811 మెట్రిక్ టన్నులు, యాసంగికి సంబంధించి 4,21,995 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు సరఫరా చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. ఆయన వెంట గోదాముల మేనేజర్ సిరిగిరి రామిరెడ్డి, మిల్లర్లు భద్రాద్రి రాములు, ఇంద్రారెడ్డి, నారాయణ, మహేందర్, ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్ సైదులు ఉన్నారు.

పురోహిత పోస్టులు భర్తీ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో కేడర్ స్ట్రెంత్‌లో ఖాళీగా ఉన్న పురోహిత పోస్టులను మంగళవారం భర్తీ చేసినట్లు ఈఓ గీతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు పోస్టులకు 30మంది దరఖాస్తు చేసుకోగా.. 27 మంది పరీక్షకు హాజరయ్యారని, ఇందులో ఎనిమిది మందికి అధిక మార్కులు వచ్చినట్లు వెల్లడించారు. 8 మంది అభ్యర్థులకు 1:2 చొప్పున పరీక్షలు నిర్వహించగా ఏ.నర్సింహశర్మ, పి.సంతోష్ శర్మ, బి.సునిల్‌కుమార్‌శర్మ, టి.భార్గవాచార్యులు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు.

సాగు అంచనా.. తప్పింది!

తగ్గిన వానాకాలం సాగు

- తలకిందులైన వ్యవసాయ శాఖ లెక్కలు
- 8.4 లక్షల ఎకరాల్లోనే వరి, పత్తి ఇతర పంటల సాగు
- లోటు వర్షపాతం, కృష్ణమ్మ పరవళ్లు లేకపోవడమే కారణం
- అడుగంటిన సాగర్.. ఆయకట్టుకు నీటి విడుదల అనుమానమే
- ఇప్పటి నుంచి నాట్లు వేసుకోకపోవడమే మంచిదంటున్న అధికారులు



నల్లగొండ అగ్రికల్చర్ : వానాకాలం సాగు తలకిందులైంది. ఎగువ నుంచి కృష్ణమ్మ పరవళ్లు లేక నాగార్జున సాగర్ జలాశయం అడుగంటింది. దీనికి తోడు వరుణుడు సరైన సమయానికి కరుణించకపోవడంతో జిల్లాలోని చాలా మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. దీంతో వ్యవసాయ శాఖ వేసిన అంచనాలకు అనుగుణంగా ఈసారి పంటలు సాగు కాలేదు.

11మండలాల్లో లోటు వర్షపాతం

వానాకాలం సీజన్‌లో జిల్లాలోని 11 మండలాల్లో లోటు వర్షం కురవగా పది మండలాల్లో సాధారణ వర్షమే కురిసింది. కేవలం 11మండలాల్లో మాత్రం సాధారణకంటే అధిక వర్షం కురిసింది. దీంతో వానాకాలం సీజన్‌లో సాగు చేసే పత్తి, వరి, కంది, పెసర, వేరుశనగ అంచనాల మేరకు సాగు కాలేదు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టులో సుమారు 1.30లక్షల ఎకరాల్లో వానాకాలంలో సాగు కానున్నట్లు అంచనా వేయగా కేవలం 10వేల లోపు ఎకరాల్లోనే వరినాట్లు వేసుకున్నట్లు అధికారులు పేర్కొంటుంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు నీటి ప్రవాహంగ లేకపోవడంతో ప్రాజెక్టు నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరింది. తాగునీటికి మాత్రమే నీటి విడుదల చేసే అవకాశం కనబడుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో సాగర్ ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేసేది అనుమానంగానే ఉంది.

వరి సాగు ఇలా..

మండలం	ఎకరాలు
తిప్పర్తి	28,420
మాడుగులపల్లి	26,700
నల్లగొండ	24,750
శాలిగౌరం	1,400
వేములపల్లి	11,600
నార్కట్‌పల్లి	14,900
నకిరేకల్	14,400
కట్టంగూరు	17,500
కనగల్	15,500

జిల్లాలోని ఎలిమినేటి మాధవరెడ్డి, మూసీ ప్రాజెక్టుల పరిధిలోని మండలాల్లోనే అధికంగా వరినాట్లు వేసుకున్నారు.

పత్తి సాగు ఇలా..

మండలం	ఎకరాలు	మండలం	ఎకరాలు
నాంపల్లి	49,500	దేవరకొండ	38,000
చింతపల్లి	44,000	మర్రిగూడ	29,650
గుర్రంపోడు	45,100	చందంపేట	27,100
మునుగోడు	40,240	నార్కట్‌పల్లి	26,200
చండూరు	39,000	పెద్దవూర	23,050
		శాలిగౌరారం	22,800
		తిరుమలగిరి	20,300

దేవరకొండ డివిజన్ పరిధిలోని మండలాల్లో పత్తిని ఎక్కువ ఎకరాల్లో సాగు చేశారు.

లోటు వర్షపాతం మండలాలు ఇవే..

జిల్లాలోని గట్టుప్పల్, అనుముల హాలియా, త్రిపురారం, వేములపల్లి, మిర్యాలగూడ, అడవిదేవులపల్లి, తిరుమలగిరి సాగర్, పెద్దవూర పీఏపల్లి, నేరేడుగొమ్ము, కొండమల్లేపల్లి మండలాల్లో సాధారణం కంటే లోటు వర్షం కురిసింది.

సాగు అంచనా 11.93 లక్షల ఎకరాలు.. సాగైంది 8.4లక్షల ఎకరాలే..

గత ఏడాది వానాకాలం సీజన్‌లో జూలై చివరి వారంలోనే సాగర్ ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేశారు. దీంతో అత్యధికంగా జిల్లాలో 5.4లక్షల ఎకరాల్లో వరినట్లు వేసుకున్నారు. పత్తి 6.41లక్షలు సాగు కాగా కంది, వేరుశనగ ఇతర పంటలు కలిపి మొత్తంగా 11.19లక్షలు సాగైంది. ప్రస్తుతం వరి 5.25లక్షల ఎకరాల్లో, పత్తి 6.50లక్షల ఎకరాల్లో, కంది పది వేల ఎకరాల్లో, వేరుశనగ 3వేల ఎకరాలు, ఇతర పంటలు కలిపి మొత్తం సీజన్‌లో 11.93లక్షల ఎకరాల్లో సాగుకానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కానీ, ప్రస్తుతం ఇప్పటి వరకు వరి 2.4 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేసుకోగా, పత్తి 5.86 లక్షల ఎకరాల్లో సాగుచేశారు. కంది ఇతర పంటలు కలిపి మొత్తం కేవలం 8.4లక్షల ఎకరాల్లో మాత్రమే రైతులు వానాకాలం సాగు చేపట్టారు.

సాగర్ నిండితేనే ..



వర్షాలు కురిసి నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండితేనే ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేసే అవకాశం ఉంటుంది. వరినాట్లు ఇప్పటి నుంచి వేసుకోకపోతేనే మంచింది. నీటి విడుదల కాకపోతే వరిచేలు ఎండిపోయే ప్రమాదం ఉంది. జిల్లాలో వరిసాగు చాలా తగ్గింది.
వై.సుచరిత, డీఏఓ

ఠాణాకు కేటాయించిన స్థలం ఆక్రమణ

- హద్దు రాళ్లు కూల్చేసి 11గుంటల భూమిని ఆక్రమించిన వెంచర్‌దారులు
- దర్జాగా మరొకరికి విక్రయించిన వైనం
- విషయం తెలుసుకుని కంగుతిన్న కొండమల్లేపల్లి పోలీసులు
- రీ సర్వే చేయించి తిరిగి హద్దురాళ్ల ఏర్పాటు


కూల్చిన హద్దురాళ్లను పరిశీలిస్తున్న అధికారులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లిలో పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన ప్రభుత్వ స్థలంలో కొంత భాగాన్ని ఆక్రమించి హద్దు రాళ్లను కూల్చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సర్వే చేయించి మళ్లీ హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న మల్లేలగట్టు వద్ద సర్వే నం. 107లో సుమారు 12.16 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ సర్వే నంబర్‌లో 2004లో 1.10 ఎకరం భూమిని 46మంది నాయీ బ్రాహ్మణులకు అప్పట్లో ఇళ్ల నిర్మాణానికి కేటాయించారు. నిర్ణీత గడువులోగా ఇళ్ల నిర్మాణం చేపట్టకపోవడం.. అంతలోనే పోలీస్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన జరుగుతున్న క్రమంలో సర్వే నం.107లో నాయీ బ్రాహ్మణులకు కేటాయించిన భూమిని రద్దు చేశారు. అదనంగా 30 గుంటల భూమిని కలిపి మొత్తం రెండు ఎకరాలను పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించారు. ఇందులో భాగంగా ఫిబ్రవరిలో సర్వే చేయించి హద్దు రాళ్లను కూడా ఏర్పాటు చేశారు.

వెంచర్‌ను ఏర్పాటు చేసే క్రమంలో..

సర్వే నం.107ను ఆనుకొని ఉన్న సర్వే నం.109లో మూడు ఎకరాల పట్టా భూమి ఉంది. సదరు పట్టాదారులు ఇందులో వెంచర్‌ను ఏర్పాటు చేసే క్రమంలో పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన ప్రభుత్వ భూమి 11గుంటలను ఆక్రమించారు. ఆక్రమించిన భూమికి 109 సర్వే నంబర్‌గా వేసి ఆ భూమిని ప్లాట్లుగా చేసి కొందరికి విక్రయించారు. గుర్తించిన పోలీసు అధికారులు అప్పట్లో సర్వే చేయించి పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన భూమికి హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. అయితే వెంచర్ ఏర్పాటులో భాగంగా పోలీస్ స్టేషన్ కోసం కేటాయించిన స్థలంలో 11 గుంటల స్థలాన్ని కొనుగోలు చేసిన వారి నుంచి వెంచర్‌దారుడికి ఒత్తిడి పెరిగింది. తమకు ప్రభుత్వ భూమిని విక్రయించారని సదరు వెంచర్ దారుడిని కొనుగోలుదారులు నిలదీశారు. ఇదిలా ఉంటే నియోజకవర్గానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి, కొండమల్లేపల్లిలో అధికార పార్టీకి చెందిన ఓ మాజీ సర్పంచ్ జోక్యం చేసుకొని 11గుంటల భూమి తమకే దక్కేలా అధికారులతో కుమ్మక్కై కనట్లు ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే పోలీస్‌స్టేషన్‌కు కేటాయించిన ప్రభుత్వ స్థలంలోని హద్దు రాళ్లను తొలగించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కంగుతున్నారు. మంగళవారం రెవెన్యూ అధికారులతో అక్కడికి చేరుకొని మళ్లీ సర్వే నిర్వహించి హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు.

మాస్ మీడియా అధికారి బదిలీ?

నల్లగొండ టౌన్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో మాస్ మీడియా అధికారి రవిశంకర్‌పై బదిలీ వేటు పడింది. ఆయనను వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని కలెక్టర్ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఆయనపై జిల్లా గైనకాలజిస్టుల అసోసియేషన్, నీలగిరి ఐఎంఏ డీఎంహెచ్‌ఓ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు అందజేయగా, ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మాస్ మీడియా అధికారిగా ఇంకా ఎవరిని నియమించలేదు.

రైలుబండి.. ఆగేదెక్కడండి?

- 'వేర్ ఈస్ ట్రైన్' యాప్‌లో ప్లాట్ ఫాం నంబర్ల తికమక
- యాప్‌లో చూపించేది ఓ ప్లాట్ ఫాం.. ట్రైన్ ఆగేది మరో ప్లాట్ ఫాం
- మిర్యాలగూడలో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


రెండో ప్లాట్ ఫాంకు వెళ్లేందుకు పట్టాలు దాటుతున్న ప్రయాణికులు

మిర్యాలగూడ : మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో రైలు ఏ ప్లాట్ ఫాం మీద ఆగుతుందో తెలియక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే స్టేషన్ ప్రారంభమైన నాటి నుంచి ప్లాట్ ఫాం నం.1లో ప్రతి రైలు ప్రయాణికులను దింపడం, ఎక్కించుకోవడం జరిగింది. ప్రస్తుత తరుణంలో వేర్ ఈస్ ట్రైన్ యాప్ ద్వారా తెలుసుకునే ప్రయాణికులకు తికమక తప్పడం లేదు. యాప్‌లో మాత్రం ప్లాట్ ఫాం నం.1లో ఆగుతుందని చూపిస్తుండగా ట్రైన్‌ను మాత్రం ప్లాట్ ఫాం నం.2లో నిలుపుదల చేస్తున్నారు. అన్ని సదుపాయాలు ఉన్న ప్లాట్ ఫాం నం.1 నుంచే ప్రయాణికులు రాకపోకలు సాగించేవారు. అయితే కరోనా సమయంలో కొన్ని రైళ్లను రద్దు చేయడంతోపాటు ఇక్కడి ఆగే రైళ్లను ఆగకుండా చేయడంతో రెండేళ్ల పాటు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రయాణికులతో పాటు ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో రైల్వే అధికారుల చొరవతో మిర్యాలగూడ స్టేషన్‌లో రైళ్ల స్టాప్‌ను పునరుద్ధరించారు. కొన్ని రోజుల నుంచి స్టేషన్‌లో రైళ్ల నిలుపుదల ఒకటవ ప్లాట్ ఫాం నుంచి రెండవ ప్లాట్‌ఫాంకు మార్చడంతో ప్రయాణికులు స్టేషన్‌కు రాగానే ఒకటవ ప్లాట్ ఫాం నుంచి రెండవ ప్లాట్ ఫాంకు వెళ్లేందుకు ప్రమాదకరంగా ఉన్న పట్టాలను దాటాల్సి వస్తోంది. ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధులు రెండోప్లాట్ ఫాంపై వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న తీరు వర్ణనాతీతం. ప్రయాణికుల సౌకర్యార్థం రైళ్లను ఒకటవ నంబర్ ప్లాట్‌ఫాంపై నిలుపుతామని రైల్వే ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ దీనికి విరుద్ధంగా రెండో నంబర్ ప్లాట్‌ఫాంకు మార్చడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఒకటవ ప్లాట్ ఫాంపై గూడ్స్‌రైలును నిలుపుతున్నారు.. తప్ప ప్యాసింజర్ రైలును నిలకపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు.

రేషన్ డీలర్లు.. దిల్‌ఖుష్

కమీషన్ రెట్టింపు చేస్తూ ప్రభుత్వ నిర్ణయం

- రూ.5లక్షల హెల్త్‌కార్డు, రూ.5లక్షల బీమా సౌకర్యం
- గోదాముల్లో వే బ్రిడ్జిల ఏర్పాటుకు నిధులు విడుదల చేస్తూ జీఓ జారీ
- ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సౌకర్యాలు


మంత్రులతో నల్లగొండ జిల్లా డీలర్లు

నల్లగొండ : తెలంగాణ ప్రభుత్వం డీలర్లను దిల్‌ఖుష్ చేసింది. వారికి రెట్టింపు కమీషన్ ఇస్తూ నిర్ణయం తీసుకుంది. మంగళవారం మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్ డీలర్లతో హైదరాబాద్‌లో సమావేశమై ఏళ్ల తరబడి ఉన్న డీలర్ల సమస్యలను పరిష్కరిస్తూ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం డీలర్లకు ఇచ్చే కమీషన్ రెట్టింపు చేయడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే రూ.5లక్షల విలువ చేసే హెల్త్ కార్డు, రూ.5లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించారు. డీలర్లు సుదీర్ఘకాల సమస్య గోదాముల్లో వే బ్రిడ్జిలు ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తూ జీఓ జారీ చేసింది. దీంతో జిల్లాలో 991మంది డీలర్లకు మేలు జరగనుంది.

రూ.20నుంచి రూ.140లకు కమీషన్ పెంపు

తెలంగాణ ఏర్పడకముందు రేషన్ డీలర్లకు బియ్యాన్ని పేదలకు పంపిణీ చేసినందుకు క్వింటాకు రూ.20 చొప్పున కమీషన్ ఇచ్చేవారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2014లో దానిని రూ.70కి పెంచింది. అయితే కొంత కాలంగా డీలర్లు ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణలో కమీషన్ తక్కువగా ఉందని పెంచాలని ప్రభుత్వానికి విన్నవిస్తూ వచ్చారు. మునుగోడు ఉప ఎన్నికకు ముందు కేటీఆర్ జిల్లాకు వచ్చిన సందర్భంలో డీలర్లు తమ సమస్యలను పరిష్కరించాలని ఆయనకు విన్నవించగా సానుకూలంగా స్పదించారు.

40ఏళ్ల సమస్యకు పరిష్కారం

డీలర్ వ్యవస్థ ప్రారంభం అయిన నాటి నుంచి వే బ్రిడ్జి సమస్య వెంటాడుతోంది. ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి డీలర్‌షాపులకు సరిఫరా అయ్యే బియ్యం తూకం వేసి ఇవ్వాలని డీలర్లు కోరుతున్నారు. అక్కడ వే బ్రిడ్జి లేకపోవడంతో తూకం వేసి ఇవ్వని పరిస్థితి. దీంతో డీలర్లు బియ్యంలో తరుగు వచ్చి నష్టపోతున్నారు. ప్రస్తుతం కేటీఆర్ హామీతో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఎంఎల్‌ఎస్ పాయింట్లలో వే బ్రిడ్జిలను ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తూ జీఓ జారీ చేయడంతో సమస్యకు పరిష్కారం లభించింది.

చనిపోయిన డీలర్ కుటుంబాలకే షాపులు

కరోనా సమయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశాయి. అప్పట్లో కరోనా వ్యాప్తి అధికంగా ఉండటంతో వ్యాధి సోకి రాష్ట్ర వ్యాప్తంగా 99మంది,నల్లగొండ జిల్లాలో 8మంది చనిపోయారు. చనిపోయిన డీలర్ కుటుంబాలకే ఎలాంటి షరతులు లేకుండా రేషన్ షాపులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

వ్యవస్థ పుట్టినప్పటి నుంచి డీలర్లు ఎదుర్కొంటున్న వే బ్రిడ్జిల సమస్యను ప్రభుత్వం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంది. డీలర్లకు రెట్టింపు కమీషన్ ఇస్తూ నిర్ణయం తీసుకోవడం సంతోషకరం. దీంతో పాటు హెల్త్ కార్డులు , బీమా సౌకర్యం కల్పించడంతోపాటు చనిపోయిన డీలర్ కుటుంబాలకే షాపులు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం ఎంతో గొప్ప విషయం. డీలర్లంతా ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.
–తెలంగాణ రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర కోశాధికారి పారెపల్లి నాగారాజు

ఇన్‌స్పైర్ మనక్‌కు నామినేషన్లు పంపాలి


మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

నల్లగొండ : 2023–24 విద్యా సంవత్సరానికి విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు నామినేషన్లు గపంపాలని డీఈఓ భిక్షపతి కోరారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సెయింట్ అల్ఫోన్సెస్ గపాఠశాలలో పాఠశాలల హెచ్‌ఎంలు, సైన్స్ ఉపాధ్యాయులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 3 లోపు విద్యార్థులు తమ ప్రాజెక్టును ఇన్‌స్పైర్ మనక్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని యజమాన్యాల పాఠశాలల్లో 6వ నుండి 10వ తరగతి వరకు చదువుచున్న విద్యార్థులు బ్యాంక్ ఖాతా, ప్రాజెక్టు వివరాలు వెబ్ అడ్రస్ లేదా యాప్ ద్వారా గడువులోపు జిల్లాలోని ప్రతి పాఠశాల తప్పనిసరిగా 5 ప్రాజెక్టులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమములో కొమ్ము శ్రీనివాస్, రామచంద్రయ్య, జిల్లా సైన్స్ అధికారి లక్ష్మీపతి, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

పశు సంచార సేవలను పారదర్శకంగా అందించాలి

దేవరకొండ : పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంచార అంబులెన్స్ 1962 సేవలను పారదర్శకంగా అందించాలని పశు సంచార అంబులెన్స్ ప్రాజెక్ట్ ముఖ్య నిర్వాహణ అధికారి డాక్టర్ భాగేష్ మిశ్రా అన్నారు. సోమవారం దేవరకొండలో 1962 సంచార అంబులెన్స్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్ రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట జిల్లా కోఆర్డినేటర్ అబ్దుల్ రహీం, డాక్టర్ జితేందర్, ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

నకిరేకల్ : గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. నకిరేకల్‌లోని మైనార్టీ ,సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గురుకుల ఉపాధ్యాయులు శ్రమకు తగిన గుర్తింపు లేదన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, తాటిపాముల నర్సింహ్మమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి వ్యవసాయ గణన

- క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చేపట్టి వాస్తవ వివరాలు సేకరించాలి
- అధికారులకు కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశం


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

నల్లగొండ : క్షేత్రస్థాయిలో వ్యవసాయ గణనను పకడ్బందీగా చేపట్టి వాస్తవ వివరాలు సేకరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. మంగళవారం ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో తన కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ గణనలో సామాజిక వర్గాలవారీగా రైతుల సంఖ్య, సన్నకారు, చిన్నకారు, పెద్ద రైతుల వివరాలు, సాగు విస్తీర్ణం, ఏయే పంటలు పండిస్తున్నారు.. నీటి వినియోగం, ఏయే యంత్రాలు అందుబాటులో ఉన్నాయి.. కౌలు రైతులు, సాగు నీటి వనరులు తదితర సమాచారాన్ని సేకరించాలన్నారు. వ్యవసాయ గణనకు కమిటీ ఏర్పాటు చేసినట్లు జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్, సీపీఓ కన్వీనర్, మెంబర్‌గా జిల్లా వ్యవసాయాధికారి ఉంటారని తెలిపారు. సీపీఓ బాలశౌరి మాట్లాడుతూ జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులు వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని, ఉప గణాంక, మండల గణాంక ప్రణాళిక అధికారులు సాంకేతిక సలహాలు ఇచ్చి సకాలంలో పూర్తి చేయాలన్నారు. నేటి నుంచి మొదటి దశ గణన చేపట్టి ఈ నెల 16 లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించినట్లు తెలిపారు. ఈ సారి కాగిత రహితంగా గణన చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు, తదనుగుణంగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మూడు దశల్లో ..

మూడు దశల్లో వ్యవసాయ గణన పూర్తి చేయాల్సి ఉంటుందని సీపీఓ తెలిపారు. మొదటి విడతలో రైతు పేరు, సామాజిక స్థితి, సాగు విస్తీర్ణం, భూమి వినియోగం, పురుషులు, మహిళలు ఇలా అన్ని వివరాలు సేకరించి రెవెన్యూ గ్రామం వారీగా నమోదు చేస్తారన్నారు. రెండో విడతలో ఎంపిక చేసిన 20 శాతం గ్రామాల్లో అదనంగా మరి కొంత సమాచారం, మూడో దశలో ఏడు శాతం గ్రామాల్లో సాగు ఖర్చులు, యంత్రాల వినియోగం, ఎరువులు, విత్తనాలు, ప్రభుత్వ రాయితీలు తదితర వాటిని సేకరించి యాప్‌లో తొలిసారిగా కాగితం వాడకుండా వివరాలను నమోదు చేస్తారని తెలిపారు. రాష్ట్ర సంచాలకులు, అర్థ గణాంక శాఖ కార్యాలయం ఉప సంచాలకులు డి.శివకుమార్ వ్యవసాయ గణనలో సమాచార సేకరణ పై శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బాల శౌరి, డీఏఓ సుచరిత, జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సంగీత లక్ష్మి, ముత్యం పాల్గొన్నారు .

ఆస్తుల రెగ్యులరైజ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

- 125 గజాల్లోపు ఉచితంగా క్రమబద్ధీకరణ

పట్టణ ప్రాంతాల్లో నోటరీల ద్వారా క్రయవిక్రయాలు జరిగి రిజిస్టర్ కాని వ్యవసాయేతర ఆస్తుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు కలెక్టర్ ఆర్.వి.కర్ణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా జీఓ నం.84 ద్వారా ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిందని తెలిపారు. నోటరైజ్డ్ డాక్యుమెంట్లు ఉన్న ఆస్తుల క్రమబద్ధీకరణకు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తుతో పాటు నోటరీ డాక్యుమెంటు, సదరు ఆస్తికి సంబంధించిన లింకు డాక్యుమెంట్లు, ఆస్తిపన్ను రశీదు, కరెంటు బిల్లు, వాటర్ బిల్లు, ఆ ఆస్తి స్వాధీనంలో ఉన్నట్టు నిరూపించే ఇతర ధ్రువపత్రాలను సమర్పించాలని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఈ దరఖాస్తుల్లో ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ఆస్తులు ఉంటే వాటికి జీఓలు 58, 59 (ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల క్రమబద్ధీకరణ) ద్వారా పరిష్కారం చూపిస్తారని లేదంటే నేరుగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ విధంగా రిజిస్టర్ చేసేందుకు 125 గజాల లోపు ఉన్న ఆస్తులపై ఎలాంటి స్టాంపు డ్యూటీ వసూలు చేయరని, అంతకు మించితే మాత్రం మార్కెట్ రేటు ప్రకారం స్టాంపు డ్యూటీ చెల్లించాలని తెలిపారు. 3000 గజాల వరకు గరిష్టంగా క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందని, అక్టోబర్ నెలాఖరు వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

మోటకొండూర్: తాటిచెట్టు పైనుంచి కిందపడి గీత కార్మికుడికి గాయాలైన ఘటన మోటకొండూర్ మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బొడిగె సత్తయ్య మంగళవారం సాయంత్రం కల్లు గీసేందుకు గ్రామ సమీపంలోని తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం ఆయనను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సత్తయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కేజీకేఎస్ రాష్ట్ర నాయకులు బొలగాని జయరాములుగౌడ్, బొడిగె భిక్షపతి, కొమ్మగాని ప్రభాకర్‌గౌడ్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో..

భూదాన్‌పోచంపల్లి: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలు.. పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం గ్రామానికి చెందిన కొయ్యడ సతీష్ పనిమీద బైక్‌పై పోచంపల్లికి వస్తుండగా సబ్‌స్టేషన్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సతీష్ కిందపడటంతో ముఖం, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం డాక్టర్ సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం బీబీనగర్ ఎయిమ్స్‌కు పంపించారు.

గడ్డి మందు తాగి మహిళ ఆత్మహత్య

గుర్రంపోడు: అప్పుల బాధతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. ఎస్ఐ బి. శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలంలోని జూనూతుల గ్రామానికి చెందిన బొల్లం యాదయ్య, సత్తమ్మ(38) భార్యాభర్తలు. వీరు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. వ్యవసాయం చేసేందుకు అప్పులు చేయగా.. చేసిన అప్పులు తీర్చలేమనే మనోవేదనతో ఈ నెల 5వ తేదీన సత్తమ్మ తమ వ్యవసాయబావి వద్దకు వెళ్లి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. అప్పుల బాధతోనే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తండ్రి బొమ్ము పర్వతాలు పోలీసులకు ఫిర్యాదులో చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడు మృతి

కట్టంగూర్: ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతిచెందిన ఘటన కట్టంగూర్ మండలంలోని పందెనపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పందనపల్లి గ్రామానికి చెందిన గజ్జి రాములు(70) మంగళవారం సాయంత్రం మేతకు వెళ్లిన తన గేదెలను తోలుకొని ఇంటికి వస్తుండగా అవి చెరువులో నీటిని తాగేందుకు వెళ్లాయి. గేదెలను నీటిలో నుంచి బయటకు తోలే ప్రయత్నంలో రాములు ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో ఉన్న గుంతలో పడిపోయాడు. కాళ్ల మధ్యలో దోతి ఇరుక్కుపోవటంతో నీట మునిగి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు.

పూట గడవని కుటుంబానికి ఆపద

- ఇంటి పెద్దను మంచానికే పరిమితం చేసిన క్యాన్సర్ మహమ్మారి
- అప్పు చేసి రూ.5లక్షలు ఖర్చు చేసినా నయంకాని వ్యాధి
- వైద్యానికే నెలకు రూ.10వేల వరకు ఖర్చు
- ఆదాయ వనరులు లేక అల్లాడుతున్న పేద కుటుంబం
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు



నోటి క్యాన్సర్ బారిన పడిన వెంకటయ్య

కన్నీటి గాథ

పేద కుటుంబానికి పెద్ద కష్టమే వచ్చింది. క్యాన్సర్ మహమ్మారి పేదింటి పెద్దను కబళిస్తుండగా.. వైద్యానికి నెలకు రూ.వేలు ఖర్చుచేయలేక ఆ కుటుంబం అల్లాడుతోంది. ఆదాయ వనరులు లేక ఒక వైపు పూ టకెళ్లని దైన్యం.. మరోవైపు మాయదారి వ్యాధి బా రిన పడిన ఇంటి పెద్ద రోజురోజుకూ క్షీణిస్తున్న ఆ రోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. దిక్కుతో చని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఆ పేద కుటుంబం సాయమందించాలని దాతలను వేడుకుంటోంది.

మునుగోడు : నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన జాజుల వెంకటయ్యకు భార్య పారిజాతతో పాటు కుమారుడు, కూతురు సంతానం. వీరికి గ్రామంలో పది గుంటల వ్యవసాయ భూమితో పాటు తలదాచుకునేందుకు చిన్నపాటి ఇల్లు ఉంది. వెంకటయ్య ఆటో నడుపుతుండగా పుట్టుమూగ అయిన పారిజాత కూలి పనులకు వెళ్తూ పిల్లలను చదివించుకుంటూ ఉన్నంతలో హాయిగానే జీవనం సాగించేవారు.

ఆరునెలలుగా నరకయాతన

ఐదేళ్ల క్రితం వెకటయ్య తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడికి వైద్య పరీక్షలు చేయించగా నోటీ క్యాన్సర్‌గా వైద్యులు నిర్ధారించారు. అప్పట్లోనే పలు ఆస్పత్రుల్లో వెంకటయ్య చికిత్స పొంది మందులు క్రమం తప్పకుండా వాడుతుండడంతో వ్యాధి తగ్గి పోయింది. మళ్లీ ఆరు మాసాల క్రితం వ్యాధి తిరగబెట్టడడంతో వెంకటయ్య మంచానికే పరిమితం అయ్యాడు. కేవలం ద్రవపదార్థాలు మాత్రమే తీసుకొని కాలం వెళ్లదీస్తూ నరకయాతన అనుభవిస్తున్నాడు.

అప్పు చేసి రూ.5లక్షలు ఖర్చు చేసినా..

ఇంటి పెద్ద దిక్కును కాపాడుకునేందుకు వెంకటయ్య కుటుంబ సభ్యులు పడరాని పాట్లు పడుతున్నారు. అందినకాడికి అప్పులు చేసి పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ. 5లక్షల వరకు ఖర్చు చేసి శస్త్ర చికిత్సలు చేయించినా నేటికీ అతని ఆరోగ్యం మెరుగుపడలేదు. వైద్యానికి నెలకు రూ.10వేలు ఖర్చు చేయాల్సి ఉండడంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఆదాయ వనరులు లేక.. ఎక్కడ అప్పులు అడుగుతారోనని తెలిసిన వారు ముఖం చాటేస్తుండడంతో ప్రస్తుతం ఆ కుటుంబం పూట గడవడమే కష్టంగా మారింది. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన కుమారుడు తండ్రిని ఆస్పత్రుల చుట్టూ తిప్పుతుండగా పారిజాత కూలి పనులకు వెళ్తూ వచ్చే అరకొర ఆదాయంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. మనసున్న మారాజులు ఆర్థిక సాయమందించి ఆదుకోవాలని ఆ కుటుంబం వేడుకుంటోంది.

పూట గడవడమే కష్టంగా ఉంది



నాన్నకు నోటి క్యాన్సర్ రావడంతో ఆయన ఆరోగ్యం మెరుగుపరిచేందుకు ఇప్పటి వరకు దాదాపు రూ.5 లక్షలకు పైగా ఖర్చుచేశాం. అయినా వ్యాధి నయం కావడం లేదు. పైగా వైద్యానికి ప్రతి నెలా రూ.10వేలు ఖర్చు అవుతోంది. ఆయన ఆటో నడిపితేనే మా కుటుంబం గడిచేది. నాన్న మంచానికే పరిమితం కావడంతో పూట గడవడం లేదు. దయగల మహారాజులు మా కుటుంబానికి సహాయం అందించి ఆదుకోవాలి.

– మణికుమార్, వెంకటయ్య కుమారుడు

తడి, పొడి విధానంతో అధిక దిగుబడులు

- కోర్ కార్బన్‌ఎక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ జాన్ ఆంబ్లర్



మాట్లాడుతున్న కోర్ కార్బన్‌ఎక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ జాన్ ఆంబ్లర్

అర్వపల్లి: వరిలో తడి, పొడి విధానంతో నీటి వాడకం తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని జర్మనీకి చెందిన కోర్ కార్బన్‌ఎక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ జాన్ ఆంబ్లర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జామీ కీచ్, ఎంపీపీ మన్నె రేణుక అన్నారు. జాజిరెడ్డిగూడెం మండలం అడివెంలలో మంగళవారం కోర్ కార్బన్‌ఎక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, స్వామి వివేకానంద రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వరిలో తడి, పొడి విధానంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల వలన భూగర్భ జలాలపై ఒత్తిడి పెరగడం వలన వ్యవసాయంలో నీటి సమర్థ యాజమాన్య పద్ధతులను పాటించడం ఎంతో అవసరమన్నారు. అలాగే వరి పొలంలో మిథేన్ విషవాయువు విడుదల కాకుండా నివారించవచ్చని చెప్పారు. తడి, పొడి పద్ధతిలో వరి సాగు చేయడం వలన వరి పంట వేరు వ్యవస్థ బలంగా అభివృద్ధి చెంది ఈదురు గాలులకు కూడా పడిపోకుండా ఉంటుందని, దిగుబడి కూడా అధికంగా వస్తుందని చెప్పారు. ఈ విధానంతో నీటి వినియోగం 17 నుంచి 30 శాతం వరకు తగ్గుతుందని అన్నారు. రైతులకు సంస్థ కోఆర్డినేటర్లు ఈ విధానంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. స్వామి వివేకానంద గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఎండీ గౌస్‌మియా అధ్యక్షతన జరిగిన సదస్సులో సీసీఎక్స్ మేనేజింగ్ డైరెక్టర్ నిరోజ్ మహంతి, ఏట శశిధర్‌రెడ్డి, స్వామి వివేకానంద సంస్థ జిల్లా మేనేజర్ జిసాన్ అలీ, సీసీఎక్స్ వైస్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి, కన్సల్టెన్సీ అశోక్ రాజేష్, సంస్థ సూపర్‌వైజర్ బాణోత్ యాకూబ్‌నాయక్, సర్పంచ్ పద్మవెంకటయ్య, మత్స్య సంఘం చైర్మన్ పిట్టల జానయ్య, వివిధ మండలాల కోఆర్డినేటర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గడ్డిపల్లిలో పెసర పంట పరిశీలన



గడ్డిపల్లి గ్రామంలో పెసర పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

గరిడేపల్లి: మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో మంగళవారం రైతులు సాగుచేసిన పెసర పంటను విద్యార్థులతో కలిసి సందర్శించినట్లు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సీనియర్ శాస్త్రవేత్త, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి. లవకుమార్ తెలిపారు. అనంతరం పెసర పంట వేసుకోవడం వలన కలిగే లాభాల గురించి వివరించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డి. ఆదర్శ్ మాట్లాడుతూ.. పెసరలో పెనుబంక, పల్లాకు తెగులు, శనగ పచ్చపురుగు గమనించినట్లు తెలిపారు. వీటి నివారణకు అసిఫెట్ 1.5 గ్రాములు లేదా అసిటామిప్రైడ్ 0.2 గ్రాములు లేదా నోవల్యూరిన్ 1మి.లీ., 5 మి.లీ. వేప నూనెతో లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్త కిరణ్ పెసరలో ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు బచ్చు సైదయ్య, జగన్నాథ యూనివర్సిటీ వ్యవసాయ డిగ్రీ విద్యార్థులు పవన్, నితిన్, నాగేంద్ర, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా ముఠా అరెస్ట్

- నిందితుల నుంచి 122 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు

కోదాడరూరల్: ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ నుంచి ఢిల్లీకి గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను కోదాడలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు మంగళవారం విలేకరులకు వెల్లడించారు. అడిషనల్ ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం .. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇర్ఫాన్ అలీ, బల్వీందర్‌సింగ్ లారీ డ్రైవర్లు. ఇద్దరు పక్క పక్క గ్రామాలకు చెందిన వారు కావడంతో పాటు డ్రైవర్ వృతిలో ఉండటంతో స్నేహితులయ్యారు. వీరు డ్రైవింగ్ చేస్తున్న సమయంలో ఢిల్లీకి చెందిన బట్టల వ్యాపారి కరణ్‌వీర్ పరిచయమయ్యాడు. కరణ్‌వీర్ తన వ్యాపార పనుల నిమిత్తం హైదరాబాద్, విజయవాడ, వైజాగ్‌కు వచ్చినపుడు ఇర్ఫాన్ అలీ, బల్వీందర్‌సింగ్‌ను కూడా అప్పుడప్పుడు కారులో తీసుకొచ్చేవాడు. కరణ్‌వీర్‌కు వ్యాపారం చేస్తే వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో గంజాయి రవాణా చేయడం ప్రారంభించాడు. ఈ విషయం ఇర్ఫాన్ అలీ, బల్వీందర్‌సింగ్‌లకు చెప్పి వైజాగ్ వెళ్లి గంజాయి ఢిల్లీకి రవాణా చేస్తే రూ.10వేల చొప్పున ఇస్తానని తెలపడంతో వారు ఒప్పుకున్నారు. ఇద్దరికి రూ.9వేలను ముందుగా ముట్టజెప్పాడు. దీంతో వారు కరణ్‌వీర్ ఇచ్చిన కారులో ఈ నెల 3న గంజాయి కోసం వైజాగ్‌కు వెళ్లారు. ఆర్‌కే బీచ్ సమీపంలో ఓ రూంలో ఉండగా గుర్తుతెలియన వ్యక్తి వచ్చి కారు తీసుకెళ్లి అందులో ఏర్పాటు చేసిన ఐరన్ బాక్స్‌లో 76 గంజాయి ప్యాకెట్లు(122 కిలోలు) అమర్చాడు. ఆ గంజాయిని వీరిద్దరూ ఢిల్లీకి తీసుకెళ్లేందుకు అక్కడి నుంచి బయల్దేరారు.

మార్గమధ్యలో పోలీసులను తప్పించుకుంటూ..

మార్గమధ్యలో చాలాచోట్ల పోలీసులను తప్పించుకుంటూ వచ్చిన వీరిద్దరు రాష్ట్ర సరిహద్దు అయిన కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్‌లోని చెక్‌పోస్ట్ వద్ద పోలీసులును చూసి పరారవుతుండగా పట్టుకున్నారు. పోలీసులు కారును తనిఖీ చేయగా గంజాయి లభించింది. ఆ గంజాయిని తహసీల్దార్ సమక్షంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.20లక్షలు ఉంటుందని అడిషనల్ ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి గంజాయితో పాటు కారు, మూడు సెల్‌ఫోన్‌లు, ఓ జీపీఎస్ మెషీన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులిద్దరిని రిమాండ్‌కు తరలించగా కరణ్‌వీర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ ప్రకాష్, కోదాడ రూరల్ సీఐ, ఎస్ఐలు రామకృష్ణారెడ్డి, సాయిప్రశాంత్, ఏఎస్ఐ ఆనంద్‌నాయక్, హమీద్, సిబ్బంది జాన్, రవి, నరహరి, రాంబాబు ఉన్నారు.

విద్యార్థిని ఢీకొట్టిన బైక్

మోత్కూరు: విద్యార్థిని బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. అడ్డగూడూరు మండలం వెల్దేవి గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ మోత్కూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం అతడు కాలేజి ముందు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో చెయ్యి విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం స్థానికులు అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దళిత బంధు అడ్డుకున్నారని ఆత్మహత్య

- కౌన్సిలర్ కారణమని సూసైడ్ నోట్



రమేష్ (ఫైల్)

మోత్కూరు: తనకు దళిత బంధు పథకం రాకుండా అధికార పార్టీ కౌన్సిలర్ అడ్డుకున్నాడని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన చావుకు కౌన్సిలరే కారణమని సూసైడ్ నోట్‌లో రాశాడు. మోత్కూరు పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన కూరెళ్ల రమేష్(46)కు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య యాదమ్మ, కుమారుడు సామేల్, కూతురు సౌజన్య ఉన్నారు. మూడు సంవత్సరాల క్రితం పెద్ద కుమారుడు వినయ్ అనారోగ్యంతో మృతిచెందాడు. కుమార్తె సౌజన్య వివాహం అయింది. చిన్న కుమారుడు సామేల్ పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. భార్య యాదమ్మ కూలి పనులు చేస్తూ కుటుంబం గడుపుతున్నారు. ఇటీవల దళిత బంధు పథకానికి వీరి కాలనీ నుంచి 20 మందితో జాబితాను కౌన్సిలర్ కూరెళ్ల కుమారస్వామి ఆధ్వర్యంలో రూపొందించారు. ఆ జాబితాలో తన పేరు లేదని తెలుసుకొని, దీనికి కౌన్సిలరే కారణమని రమేష్ భావించాడు. దళిత బంధు పథకం లబ్ధిదారుల జాబితా తయారీ కోసం కాలనీలో రెండు వర్గాలు విడిపోయాయని, తన కంటే మెరుగ్గా ఉన్న వారికి పథకంలో ఎంపిక చేశారని రమేష్ కొన్ని రోజులుగా మనోవేదనకు గురవుతున్నట్లు స్థానికులు తెలిపారు. కాలనీకి చెందిన ఓ వ్యక్తి మంగళవారం మృతి చెందడంతో అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు వెళ్లగా.. రమేష్ ఇంట్లోనే ఉన్నాడు. ఈ క్రమంలో రమేష్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కుమారుడు సామేల్ వచ్చి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. చుట్టుపక్కల వారు వచ్చి కిందికి దింపారు. మృత దేహాన్ని ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించి పంచనామా నిర్వహించి భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తన చావుకు కౌన్సిలరే కారణమని అని రమేష్ తన సూసైడ్ నోట్‌లో రాశాడు.

నాకు సంబంధం లేదు..

కూరెళ్ల రమేష్ ఆత్మహత్యకు తాను కారణమనే మాట అవాస్తవమని కౌన్సిలర్ కూరెళ్ల కుమారస్వామి తెలిపారు. దళిత బంధు జాబితా తయారీ ఎంపికలో తనకు సంబంధం లేదని కౌన్సిలర్ చెప్పారు.

హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఇద్దరి రిమాండ్

మఠంపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 6న స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన ఇద్దరు యువకులను మంగళవారం రిమాండ్‌కు తరలించారు. మఠంపల్లి ఎస్ఐ సీహెచ్. బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లికి చెందిన ఎల్లబోయిన నాగరాజు, మామిడి నరేందర్ ఈ నెల 6వ తేదీన స్థానిక ఇండియన్ ఆయిల్ పెట్రోల్ దగ్గర మద్యం తాగి ప్రయాణికులపై దాడి చేస్తుండగా ఆపడానికి వెళ్లిన హెడ్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డారు. హెడ్‌కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చగా జడ్జి వారికి రిమాండ్ విధించడంతో మంగళవారం జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఉజ్వల భవిష్యత్తుకు 'నవోదయం'

- జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 10వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం
- ఉమ్మడి జిల్లాకు సంబంధించి చలకుర్తి జేఎన్‌వీలో 80 సీట్లు
- 2024 జనవరి 20న ప్రవేశ పరీక్ష



నాగార్జునసాగర్‌లోని చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయం

పెద్దవూర: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడంలో జవహర్ నవోదయ విద్యాలయాలు(జేఎన్‌వీ) కీలకపాత్ర పోషిస్తున్నాయి. జేఎన్‌వీలో 2024–2025 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల అయ్యింది. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో 1986 జాతీయ విద్యావిధానాన్ని అనుసరించి దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు 1986లో నల్లగొండ జిల్లాకు సంబంధించి అప్పటి శాసనసభ నియోజకవర్గమైన చలకుర్తి గ్రామంలో 45 ఎకరాల విస్తీర్ణంలో జేఎన్‌వీని ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష ద్వారా 6వ తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. 6 నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్య, బాలబాలికలకు వేర్వేరుగా హాస్టల్ వసతి సౌకర్యం కల్పిస్తారు. 6 నుంచి 8వ తరగతి వరకు ప్రాంతీయ భాష లేదా మాతృ భాషలో విద్యాబోధన జరుగుతుంది. ఆ తరువాత తరగతులలో గణితం, సైన్స్ సబ్జెక్టులు ఆంగ్ల భాషలోనూ, సామాజిక శాస్త్రములు హిందీ భాషలోనూ బోధిస్తారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఒక్కో తరగతిలో 80 మంది విద్యార్థులు, 11, 12 తరగతులలో 40 మంది చొప్పున విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు.

దరఖాస్తు చేసుకునే విధానం..

2024–25 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారంపై ప్రస్తుతం విద్యార్థి చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకం చేయించిన తర్వాతే వెబ్‌సైట్ నందు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 5వ తరగతి ఏ పాఠశాలలో చదువుతున్నారో అక్కడి నుంచి స్టడీ సర్టిఫికెట్ తీసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తు ఫారంపై విద్యార్థి, తండ్రి సంతకాలు తప్పకుండా ఉండాలి. ఫొటో కూడా అప్‌లోడ్ చేయాలి. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జేఎన్‌వీనల్గొండ.ఇన్ ద్వారా లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకోవటానికి ఈ నెల 10వ తేదీ ఆఖరు.

ఎవరు అర్హులు..?

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతూ 01.05.2012 నుంచి 31.07.2014 మధ్య జన్మించిన వారు అర్హులు. ప్రవేశ పరీక్ష 2024 జనవరి 20వ తేదీన ఉదయం 11.30 నుంచి 1.30 వరకు రెండు గంటల పాటు నిర్వహిస్తారు.

కష్టపడితే సీటు ఖాయం



విద్యార్థులు కొంచెం కష్టపడితే జేఎన్‌వీలో సీటు సాధించవచ్చు. ప్రవేశ పరీక్ష ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో పారదర్శకంగా నిర్వహిస్తాం. ప్రశ్నపత్రం తయారీ నుంచి విద్యార్థుల ఎంపిక వరకు సీబీఎస్ఈ వారే నిర్వహిస్తారు. నవోదయ సీట్లు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మవద్దు. అలాంటి వారిపై పోలీసులతో కలిసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– ఆర్. నాగభూషణం, చలకుర్తి జేఎన్‌వీ ప్రిన్సిపాల్

రిజర్వేషన్ విధానం

6వ తరగతిలో మొత్తం 80 సీట్లు ఉండగా అందులో 75 శాతం సీట్లు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, 25 శాతం సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయించారు. గ్రామీణ ప్రాంత రిజర్వేషన్ వర్తించాలంటే 3, 4, 5 తరగతులు గ్రామీణ ప్రాంతాలలో చదివి ఉండాలి. ఏ ఒక్క రోజు పట్టణ ప్రాంతాలలోనూ, మున్సిపాలిటీలలో చదివినా గ్రామీణ ప్రాంత రిజర్వేషన్ వర్తించదు. ఎట్టి పరిస్థితులలోనూ ఒకసారి పరీక్షకు హాజరైన విద్యార్థి రెండోసారి హాజరయ్యేందుకు వీల్లేదు. ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 7.5శాతం, బాలికలకు మొత్తం సీట్లలో 1/3వ వంతు రిజర్వేషన్ ఉంటుంది. అభ్యర్థి ఐదో తరగతిలో ఏ మాధ్యమంలో విద్యాభ్యాసం చేస్తారో.. ఆ భాషలోనే పరీక్ష ఉంటుంది. అభ్యర్థి దరఖాస్తు చేసుకున్న ఫారం, ప్రవేశ పత్రంలో పేర్కొన్న భాషలోనే టెస్టు బుక్‌లెట్ ఇస్తారు. దరఖాస్తు ఫారంలోనూ, ప్రవేశ పత్రంలో పరీక్షా మాధ్యమం ఒకేలా ఉండేలా చూసుకోవాలి. ప్రవేశ పరీక్ష మూడు విభాగాలలో కలిపి 80 ప్రశ్నలు ఆబ్జెక్టివ్ రూపంలో ఉంటాయి. రీజనింగ్ 40 ప్రశ్నలు, గణితంపై 20 ప్రశ్నలు, భాషా పరిజ్ఞానంపై 20 ప్రశ్నలు ఉంటాయి. విద్యార్థులు సమాధానాలను ఐసీఆర్/ఓఎంఆర్ పత్రంలో పూరించాలి.